

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

సోమవారం, 7 జులై 2025 | 8 పేజీలు

నేడు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం

విశాలాంధ్ర-రాయచోటి: ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా మీకోసం. ఏపీ.జీఓవి.ఇన్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు, నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

యాంటీ రేబీస్ టీకాలు వేయించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: జంతు ప్రేమికులు తమ పెంపుడు శునకాలకు తప్పనిసరిగా యాంటీ రేబీస్ టీకాలు వేయించి జంతు సంక్రమిత వ్యాధులను నివారించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత రాబిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని స్థానిక పశు సంవర్ధక శాఖ పాలీ క్లినిక్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై యాంటీ రేబిస్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు జూనొసిస్ (జంతు సంక్రమిత) వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. జిల్లాలో దాదాపు 17వేల డోసులు అందుబాటులో ఉన్నాయని పెంపుడు జంతువుల ప్రేమికులందరూ వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల వారీగా మండలాల్లో గ్రామాల్లో పశు వైద్యశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత రేబిస్ టీకాలను వేస్తున్నట్లు తెలిపారు. జంతు ప్రేమికులందరూ జంతు సంక్రమిత దినోత్సవాన్ని గుర్తుంచుకొని యాంటి రేబిస్ వ్యాక్సినేషన్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ, డిడి రంగస్వామి, ఇన్చార్జి డిడి శ్రీనివాసరెడ్డి,ఏడి డాక్టర్ సుబ్బరాయుడు, ఏడి డా. నేతాజీ, ఏడి డా.మాధవి, డా. సంధ్యారాణి, డా.చాంద్ బాషా, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

- ఉగ్ర మూకలపై కొనసాగుతున్న దర్యాప్తు - ఉగ్రవాదులకు నిలయంగా రాయచోటి

ఆ ఇద్దరు.. సామాన్యులు కాదు!

విశాలాంధ్ర-రాయచోటి: రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టుతో తెలుగు రాష్ట్రాలు ఉలిక్కిపడ్డాయి. అబూబకర్ సిద్ధిఖీ, మహమ్మద్ అలీ అనే ఈ ఉగ్రవాదులు చాలాకాలంగా స్థానికుల్లో కలిసిపోయి, ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. వీరి నుంచి పేలుడు పదార్థాలు, పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ టెర్రరిస్టులు పలు కీలక కేసులో వాంటెడ్గా ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే 30ఏళ్లుగా ఈ ఉగ్రవాదులు పోలీసుల కళ్లుగప్పి ఎలా తిరిగుతున్నారు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దిల్సుఖ్ నగర్ బాంబు పేలుళ్లు, లుంబినీ పార్కు, గోకుల్ చాట్ బాంబు పేలుడు ఘటనలు గుర్తొస్తే ఇప్పటికీ వణుకు పుడుతుంది. ఆ తర్వాత దక్షిణాదిలో ఉగ్రదాడుల ఘటనలు చాలా వరకు తగ్గిపోయాయని భావిస్తుండగా తెలుగు రాష్ట్రాలను ఉలిక్కిపాటుకు గురిచేసే వార్త ఒకటి వెలుగులోకి వచ్చింది. ఏపీలోని రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులను అరెస్టు చేయడం అలజడి రేపింది. వీళ్లు చాలా ఏళ్లుగా స్థానికులుల్లో కలిసిపోయి చాప కింద నీరు లాగా ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలియడం ఆందోళనకు గురిచేస్తోంది. పని మీద బయటకి వెళ్తున్నట్లు చెప్పి, దేశంలో ఎక్కడెక్కడో ఉగ్రవాద దాడులకు ప్రయత్నిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా బాంబులను తయారు చేస్తున్నారు. జమ్మూ కాశ్మీర్లోని హహల్గామ్లో ఉగ్రవాదులు జరిపిన మారణహెూమం తర్వాత.. ఇంటెలిజెన్స్ వర్గాలు, టెర్రరిస్ట్ స్క్వాడ్ అప్రమత్తమై జరుపుతున్న తనిఖీల్లో భాగంగా రాయచోటిలో ఉగ్రవాదుల కదలికల గురించి వెలుగులోకి వచ్చింది. పహల్గామ్లో టెర్రరిస్టులు జరిపిన కాల్పుల్లో 26 మంది పర్యాటకులు మృతి చెందారు. పేర్లు అడిగి, మతం నిర్ధరించుకుని మరీ భార్యా, పిల్లల కళ్ల ముందే భర్తలను చంపేశారు. పెళ్లి ముచ్చట ఇంకా తీరకముందే భర్తను కోల్పోయి మృతదేహం వద్ద నవవధువు రోధించిన దృశ్యాలు ఇంకా కళ్ల ముందే కదలాడుతూనే ఉన్నాయి. ఉగ్రవాదులపై భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు చేసింది. అంతేకాకుండా దేశంలో అంతర్గతంగా ఉగ్రకార్యకలాపాలపై కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. క్రమంలో లింకులు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్లో ఇద్దరు టెర్రరిస్టులను అరెస్టు చేయడంతో దక్షిణ భారతం అంతా ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురైంది. ఏకంగా ఆంధ్రప్రదేశ్ మంత్రి సొంత నియోజకవర్గంలో అన్నమయ్య జిల్లా రాయచోటి సమీపంలోని కొత్తపల్లిలో అబూబకర్ సిద్ధిఖీ (అలియాస్ అమానుల్లా), మహమ్మద్ అలీ (అలియాస్ మన్సూర్) అనే ఇద్దరు ఉగ్రవాదులను తమిళనాడు యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ అరెస్ట్ చేయడం సంచలనంగా మారింది. దక్షిణ భారతదేశంలో దశాబ్దాలుగా హై-ప్రొఫైల్ ఉగ్రవాద ఘటనల్లో నిందితులుగా ఉన్న వీరిద్దరిపై పెద్ద సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. అయితే, మొత్తం కేసుల సంఖ్యపై స్పష్టమైన సమాచారం లేదు.

- అబుబకర్ సిద్దిక్, మహమ్మద్ అలీపై నమోదైన ప్రధాన కేసులుబీ 1995 నాగూర్ పోలీస్ స్టేషన్ హత్య, పేలుడు పదార్థాల కేసు: 1990ల మధ్యలో జరిగిన ఈ ఘటనలో అబుబకర్ సిద్ధిక్ ప్రమేయం ఉన్నట్లు తేలింది.
- 1995 చింతద్రి పేట బాంబు పేలుడుబీ చెన్నైలోని హిందూ మున్నాని కార్యాలయం వద్ద జరిగిన ఈ బాంబు దాడి కేసులో ఇతడు నిందితుడు.
- 1995 నాగూర్ పార్సెల్ బాంబు పేలుడు: టి.ముత్తుకృష్ణన్ హత్యకు దారితీసిన పార్సెల్ బాంబు కేసులో కూడా అబుబకర్ నిందితుడిగా ఉన్నాడు.
- 1999 కో-ఆర్డినేటెడ్ బాంబు పేలుళ్లు: కేరళలోని కొన్ని ప్రాంతాలు సహా తమిళనాడులోని చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూర్ లాంటి ఏడు వేర్వేరు ప్రాంతాలలో జరిగిన ఈ వరుస బాంబు పేలుళ్ల కేసులలో అబుబకర్ సిద్ధిక్ కీలక నిందితుడు. అదే సమయంలో చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయం (ఎగ్మూర్) వద్ద జరిగిన పేలుడు పేలుడులో అబుబకర్ సిద్ధిక్ తో పాటు మహమ్మద్ అలీ నిందితుడిగా ఉన్నాడు.
- 2011 మధురై పైప్-బాంబు అమర్చే ప్రయత్నం: బీజేపీ సీనియర్ నాయకుడు

2 లో

పలకరింపేకానీ.. పరిహారం ఏదీ...?

- నాలుగునెలలు కావస్తున్నా అందని సాయం
- అందని ద్రాక్షలా అరటి రైతుల పరిహారం
- నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత లింగాలకు రాక

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల ప్రాంతంలో పెనుగాలుల విధ్వంసానికి నాలుగు నెలలు కావస్తోంది. అప్పట్లో 1042.51హెక్టార్ల పంట నష్టం సంభవించింది. 1355మంది రైతులు పరిహారానికి అర్హులుగా ఉద్యాన శాఖ గుర్తించింది. ఆ మేరకు పంట నష్ట నివేదికలు ప్రభుత్వానికి ఉద్యానశాఖ అందజేసింది. కానీ ఇంత వరకు పైసా కూడా ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందలేదు. ఈ ఏడాది వేసవిలో నాలుగు విడతలుగా ఈదురుగాలులు సంబవించాయి. ఈ ఏడాది మార్చి 22వ తేదీన సంబవించిన పెనుగాలులకు 567.99హెక్టార్లు, 669మంది రైతులు దెబ్బతిన్నారు. అలాగే రెండో విడత ఏప్రిల్ 14వ తేదీన మరో సారి పెనుగాలులు విరుచుకుపడ్డాయి. దీంతో 246.13హెక్టారల్లలో అరటిపంట దెబ్బతినింది. ఇందుకు 332మంది రైతులకు కోలుకోలేని దెబ్బతిగిలింది. ఇక మూడో విడత అదే నెల 18వ తేదీన వీచిని ఈదురుగాలులకు 156.76హెక్టార్లు, 252 మంది రైతులు, అలాగే నాల్గవ విడత మే 12వ తేదీన71.53హెక్టార్లు, 102మంది రైతులు దెబ్బతిన్నారు. మొత్తం 1042.51హెక్టార్లు, 1355మంది రైతులు దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి వెల్లడించారు. ఈ బీభత్సంలో 80 నుంచి 90శాతం అరటితోటలు నేలమట్టమయ్యాయి. పంట నష్టం జరిగిన సమయంలో అటు అధికార ఇటు ప్రతిపక్షపార్టీల నాయకులు దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించారు. అదే సమయంలో హెక్టారుకు రూ.30వేలు చొప్పున పరిహారం చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటన చేసింది. నెలలోపు పరిహారం అందిస్తామని కూడా ప్రభుత్వం హామీనిచ్చినట్లు రైతులు చెబుతున్నారు. నష్టం జరిగి నాలుగు నెలలు కావస్తున్నా పరిహారం అందకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మేలో జరిగిన మహానాడులో అరటి రైతులు ప్రస్తావన ఊసేలేదు. ఇదిలావుండగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత లింగాల పర్యటకు విచ్చేస్తున్నట్లు టిడిపి శ్రేణులు వెల్లడించారు. ఈ విషయాన్ని అధికారపార్టీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో అరటి రైతులకు పరిహారం అందించేందుకు కృషి చేస్తారని ఆశిద్దాం.

కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఇంటింటికి తెలపాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: "బాబు షూరిటీ-మోసం గ్యారంటీ" చంద్రబాబు మేనిఫెస్టో ను గుర్తుకు తెస్తూ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కడప నగరంలోని యూఎస్ మహల్ కళ్యాణ మండపం నందు వైయస్సార్సీపి కడప నియోజకవర్గ సమన్వయ కర్త ఎస్‌బి అంజాద్ భాష ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. వైయస్సార్ సిపి పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, కడప నగర మేయర్ కే.సురేష్ బాబు, పార్టీ పరిశీలకులు కొండూరు అజయ్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు ముంతాజ్ జమాల్ వలి, నిత్యానంద రెడ్డి, డాక్టర్ సాహెల్ అహ్మద్ హాజరైనారు. కడప నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి నాయకులు, జిల్లా స్థాయి నాయకులు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా మొహరం పండుగ

విశాలాంధ్ర-వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తిలో హిందూ, ముస్లింలు ఐక్యతగా కలిసి మొహరం పండుగను ఘనంగా జరుపుకున్నారు. చింతపర్తిలోనిపీర్ల చావడి లో పీర్లను అధిరోహింప జేసి హిందూ, ముస్లింలు ఐక్యతగా గత మూడు రోజులుగా నిత్యం పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం పీర్ల చావడిలో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించిన అనంతరం హిందూ, ముస్లింలు కలిసి కట్టుగా సహపంక్తి భోజనాలు చేశారు. ఈ విందు కార్యక్రమంలో ముస్లిం, హిందువు అన్న తేడా లేకుండా ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పీర్ల పం డుగను పండుగను ఘనంగా నిర్వహించు కోవడం విశేషం. కార్యక్రమంలో చింతపర్తికి చెందిన హిందువులు, ముస్లింల పెద్దలతో పాటు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఫిల్టర్లను పరిశీలించిన సర్పంచ్

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నీటి సరఫరా తక్కువ కావడంతో వేంపల్లి సర్పంచ్ ఆర్. శ్రీనివాసులు పాపాగ్ని నదిలో ఉన్న ఫిల్టర్లన్నీ ఆదివారం పరిశీలించి అందులో మూడు ఫిల్టర్లలో పూర్తిగా నీరు రాకపోవడంతో నీటీ ఎద్దడి ఏర్పడిందని కావున సత్వరం పాపాగ్ని నదిలో కొత్త ఫిల్టర్లు వెయ్యాలని అధికారులను ఆదేశించారు. వేంపల్లి పంచాయతీ పరిధిలోని ప్రజలకు నీటి సమస్య ఉండకూడదు అనే వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు, తాత్కాలికంగా కొత్త ఫిల్టర్ ను వేసే వరకు వాటర్ ట్యాంకర్లతో పంపించి నీటి సమస్య లేకుండా చూడాలని వేంపల్లి సర్పంచ్ ఆర్. శ్రీనివాసులు అన్నారు. ఆయన వెంట వార్డు మెంబర్ సునీల్, పంచాయతీ సిబ్బంది శివ, అనిల్, యోగేశ్వర్ ఉన్నారు.

ట్రాక్టర్ ఢీ.. 50గొర్రెలు మృతి

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి మండలం నందిపల్లి- తాళ్లపల్లి మధ్యలో ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో 50 గొర్రెలు మృతి చెందాయి. ఈ గొర్రెలు తాటిమాకులపల్లె ఎస్సీ కాలనీకి చెందిన వారివిగా గుర్తించారు. వీరంతా తాళ్లపల్లిలో మేపుకోసం వెళ్తున్న సమయంలో అటుగా స్పీడుగా వచ్చిన ట్రాక్టర్ గొర్రెలను ఢీకొనగా అక్కడికక్కడే 50 గొర్రెలు మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మెగా జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు

విశాలాంధ్ర-వేంపల్లి: మెగా జాబ్ మేళా ద్వారా యువతకు తీసుకొస్తున్నామని, వాటిని యువత అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని వెంపల్లె మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి అన్నారు. వెంపల్లెలోని జిల్లా పరిషత్ బాలురా ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమం ప్రారంభంలో రఘునాథరెడ్డి పాల్గొన్నారు. మెగా జాబ్ మేళాలో కడప జిల్లాలోని కొప్పర్తిలోని కంపెనీలు పాల్గొన్నాయి. మెగా జాబ్ మేళాకు పెద్దసంఖ్యలో వచ్చిన అభ్యర్థులను ఉద్దేశించి రఘునాథరెడ్డి మాట్లాడుతూ. తల్లిదండ్రులు కష్టపడి తమ పిల్లలను చదివిస్తున్నారని కొంత మంది ఉన్నత విద్యను అభ్యసించి గ్రామాల్లోనే ఉండిపోతున్నారన్నారు. ఏదో ఒక ఉద్యోగాన్ని చూసుకుని ఆ ఉద్యోగం చేస్తూనే మరో మంచి ఉద్యోగం చూసుకోవాలి అనే దృక్పథాన్ని యువత అలవరచుకోవాలన్నారు. జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లాలి అనుకునే వారు ధైర్యంగా అడుగులు ముందుకు వేయాలన్నారు. ఏ ప్రాంతంలో ఉద్యోగం వచ్చినా అక్కడికి ధైర్యంగా వెళ్లి ఉద్యోగాలు చేయాలని అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత ఉద్యోగాలు చేస్తూ తమ తల్లిదండ్రులకు డబ్బులు పంపిస్తూ ఉంటే ఆ తల్లిదండ్రుల్లో వచ్చే ఆనందం మాటల్లో చెప్పలేమన్నారు. యువత తమ కుటుంబంతో పాటు సమాజం పట్ల కూడా సామాజిక స్పృహ కలిగి ఉండాలి. నేడు మనం తీసుకునే నిర్ణయం మన భావితరాల భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తుందన్నారు. అందుకే మంచి అయినా, చెడు అయినా. అందుకే యువత స్వీయ క్రమశిక్షణతో నేడు తమ జీవితాన్ని ముందుకు నడిపితే, తమ కుటుంబంతో పాటు సమాజం, భావితరాలు కూడా అభివృద్ధి పథంలో ముందుకు వెళతారన్నారు. యువత ముఖ్యంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. గంజాయి, డ్రగ్స్, కొకైన్, హెరాయిన్ వంటి భయంకరమైన మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును చిత్తు చేస్తున్నాయని మత్తుకు బానిసలైన యువత తమ జీవితాలతో పాటు తమ కుటుంబ భవిష్యత్తును కూడా నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఈ ప్రభావం సమాజంపై, రాష్ట్ర ప్రగతిపై చూపిస్తోందని. మెరుగైన సమాజాన్ని నిర్మించాలన్నా, గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాల రహిత రాష్ట్రంగా మన ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టాలన్నా అది యువత చేతిలోనే ఉందన్నారు. ఏ ఒక్కరూ మత్తు పదార్థాలకు దగ్గర కాకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత ఐదేళ్ల పాలనలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దూరమయ్యాయని ఏపీ నుండి కంపెనీలు ఇతర రాష్ట్రాలకు పారిపోయాయన్నారు. రాష్ట్ర యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాల్లో వెళ్లి అనేక సమస్యలు ఎదుర్కోవాల్సిన దుస్థితిని గత పాలకులు తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే ఏపీకి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని యువతకు ఉద్యోగావకాశాలు కూడా ఎక్కువగా వచ్చేందుకు మార్గం ఏర్పడుతోందన్నారు. రానున్న కాలంలో ఇతర రాష్ట్రాల యువత మన రాష్ట్రంలోనే ఉద్యోగాల కోసం క్యూలో నిలబడే పరిస్థితులు రాబోతున్నాయంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వం తీసుకున్న చొరవ అన్నారు. ఈ విషయాలన్నింటినీ యువత దృష్టిలో పెట్టుకుని తమ జీవితాలను ఉన్నత స్థానంలో నిలబెట్టుకోవాలని కోరుతున్నానని అజ్జుగుట్టు రఘునాథరెడ్డి అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళిత చిహ్నం డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్

విశాలాంధ్ర-పులివెందుల: అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేసి ఆయన జీవితాన్ని అంకితం చేసిన మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ దళిత చిహ్నం అని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పేర్కొన్నారు. మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్ రామ్ 115వ వర్ధంతి సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీ రాజా కళానిలయంలో నృత్య చిన్నారుల నడుమ స్నేహిత అమృత హస్తం సేవా మితి అధ్యక్షులు రాజు, శ్రీ రాజాకళా నిలయం నృత్య శిక్షకుడు రాజా లు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ బాబూ జగజ్జీవన్ రామ్ ఒక సామాన్య రైతు కుటుంబంలో 1908ఏప్రిల్ 5న బాబూ జగ్జీవన్ రామ్ జన్మించారు. ఆయన అర్రా టౌన్ స్కూల్ నుండి మెట్రిక్యులేషన్ మొదటి విభాగంలో ఉత్తీర్ణుడయ్యాడు."అణగారిన వర్గాల అభివృద్ధి కోసం అలుపెరుగని కృషి చేసిన మహనీయుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్. ఈ కార్యక్రమంలో సేవాసమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సభ్యులు రాజు, రాజేష్ పాల్గొన్నారు.

ఆ ఇద్దరు సామాన్యులు కాదు

మొదటి పేజీ తరువాయి

ఎల్.కె. అద్వానీ రథయాత్రను లక్ష్యంగా చేసుకుని మధురైలో పైప్-బాంబు అమర్చే ప్రయత్నం కేసులో అబుబకర్ ప్రమేయం ఉంది.

- 2012 వేలూరులో డాక్టర్ అరవింద్ రెడ్డి హత్య కేసులో కూడా అబూబకర్ నిందితుడు.
- 2013 బెంగళూరు బీజేపీ కార్యాలయం బాంబు పేలుడుబీ ఈ కేసు చార్జిషీట్లో అబుబకర్ సిద్దిక్ 19వ నిందితుడిగా పేర్కొన్నారు. ఈ బాంబు దాడి కేసులో మన్సూర్ కూడా నిందితుడిగా ఉన్నాడు.

దక్షిణాదిలో అతి పెద్ద ఉగ్రవాద సంస్థ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ వెల్లడించిన కీలక సమాచారం. ప్రకారం, స్థానిక పోలీసుల సహాయంతో తమిళనాడు యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఈ ఇద్దరు వ్యక్తులు 'అలూమా' అనే ఉగ్రవాద సంస్థకు చెందినవారు. 'అలూమా' అనేది దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ఉగ్రవాద సంస్థ అని ప్రవీణ్ పేర్కొన్నారు. నిందితులు దేశంలోని మూడు ప్రధాన నగరాల్లో పేలుళ్లకు కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు. అబూబకర్ సిద్దిఖీ, మహమ్మద్ అలీల ఇళ్లలో సోదాలు చేసిన పోలీసులు ఉగ్రవాదానికి సంబంధించిన పుస్తకాలు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. వారి ఇళ్లకు తాళాలు వేశారు. దర్యాప్తులో భాగంగా దాదాపు 50-60 ఐఈడీలు తయారు చేసేందుకు కావాల్సిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు డీఐజీ తెలిపారు. ఒక సూట్కేసు బాంబు కూడా స్వాధీనం చేసుకుని, రాయచోటి డీఎస్పీ ఆఫీస్ దగ్గర యాంటీ టెర్రర్ టీమ్- ఆక్టోపస్ డిఫ్యూజ్ చేసింది.

ఇక్కడి నుంచే అంతా నడిపిస్తున్నారా..?

నిందితుల నుంచి పేలుడు పదార్థాలతో పాటు ఫ్యూయల్ ఆయిల్ కలిపిన అమ్మోనియం నైట్రేట్, గన్ పౌడర్ లు, 20కిలో సూట్ కేసులో ఖఖఔ-బేస్డ్ బాంబ్, పొటాసియం నైట్రేట్, పొటాసియం క్లోరైట్, పొటాసియం పర్మాంగనేట్, బాల్ బేరింగ్స్, నట్స్ బోల్ట్స్, క్లాక్ మెకానిజం, ప్రెషర్ స్విచ్లు, పుల్ స్విచ్లు, స్పీడ్ కంట్రోలర్స్, వాకీటాకీలు, రేడియో ఎక్విప్మెంట్, హ్యాకింగ్ సాఫ్ట్వేర్, మొబైల్ ఫోన్లు, డిజిటల్ స్టోరేజీ డివైజ్లు, కోడింగ్ బుక్స్, దేశంలోని మూడు ప్రధాన నగరాలు, రైల్వే నెట్వర్క్ మ్యాప్లు, మత సంబంధమైన పుస్తకాలు, చెక్ బుక్స్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన అబూబకర్ సిద్దిఖీ, మొహమ్మద్ అలీలు గత కొన్నేళ్లుగా రాయచోటిలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ ఇక్కడే పెళ్లిళ్లు చేసుకుని స్థానికులుగా ఉండిపోయారు. చిన్న, చిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అబుబకర్ రాయచోటిలోని కొత్తపల్లె ఉర్దూ స్కూల్ ఎదురుగా అమానుల్లా పేరుతో షాపు నిర్వహిస్తున్నాడు. మహబూబ్ బాషా వీధిలో మొహమ్మద్ అలీకి సొంత ఇల్లు ఉంది, చీరల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. వీరు కొన్ని నెలలపాటు రాయచోటిలో ఉండకుండా వెళ్లిపోయి, వ్యాపారం కోసం బయటకు వెళ్లినట్లు స్థానికులతో చెప్పేవారని తెలుస్తోంది.

ఇన్నేళ్లు ఇలా తప్పించుకున్నారా?

నకిలీ గుర్తింపులు, స్థానిక సమాజంలో కలసిపోవడం: ఈ నిందితులు దశాబ్దాలుగా నకిలీ పేర్లతో ఆంధ్రప్రదేశ్లో సామాన్యుల్లా జీవించారు. చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ, స్థానికంగా పెళ్లిళ్లు చేసుకొని ఎవరికీ అనుమానం రాకుండా మారువేషంలో ఉన్నారు.

రాష్ట్రాల మధ్య సంచారం

వీరు తమిళనాడుకు చెందినవారైనా.. ఆంధ్రప్రదేశ్లో పాటు వివిధ రాష్ట్రాల్లో దాక్కున్నారు. వివిధ రాష్ట్రాల మధ్య నిమా సమన్వయం లేకపోవడాన్ని ఉపయోగించుకున్నారు. పరిమిత నిఘా సమాచారం: దశాబ్దాలుగా ఈ ఉగ్రవాదుల కచ్చితమైన ఆచూకీపై ఎలాంటి సమాచారం లేదు. డిజిటల్ అడుగుజాడలు లేకుండా, తక్కువ ప్రొఫైల్ ను నిర్వహించారు.

8న చెన్నూరుకి మంత్రి సవిత రాక

- కన్వీనర్ విజయ భాస్కర్ రెడ్డి

విశాలాంధ్ర-చెన్నూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి మంత్రి సవిత హాజరవుతున్నారని టిడిపి మండల అధ్యక్షుడు కల్లూరి విజయ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చెన్నూరు లోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన మంగళవారం ఉదయం 8 గంటలకు చెన్నూరు లోని బెస్త కాలనీకి కడప ఇన్చార్జి మంత్రి సవిత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్త నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి లు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. కావున మండలంలోని ప్రజలు కార్యకర్తలు హాజరుకావాలని వారికున్న సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. మండల ప్రజలకు సమస్యలు ఉంటే బెస్త కాలనీలోకి ఎనిమిది గంటలకు రావాలని, సమస్యలు మంత్రి దృష్టికి తీసుకుపోయి ఆ సమస్యకు పరిష్కారం చూపేందుకు నాయకులు అధికారులు కృషి చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇంది రెడ్డి శివారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కుంచం రామకృష్ణారెడ్డి, పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి ఆవుల పవన్ కుమార్ రెడ్డి, కమలాపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల చలపతి, బిసి సెల్ అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రహ్మణ్యం, బి మురళి, భవాని ఆచారి కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయమే శిరోధార్యం

విశాలాంధ్ర-రామసముద్రం: తెలుగుదేశం పార్టీలో పార్టీ నిర్ణయమే అందరికీ శిరోధా ర్యం అని టిడిపి స్టేట్ అబ్జర్వర్ గురుమూర్తి తెలిపారు గడచిన శనివారం రామసము ద్రం మండలంలో టిడిపి సమస్థాగత ఎన్నికలలో కొన్ని పంచాయతీలలో వర్గ విభేదాలు తారాస్థాయి చేరుకుని కొట్టుకునే స్థాయికి వెళ్ళింది దీంతో పార్టీ అధిష్టానం పరిస్థితి చక్కదిద్దేందుకు అబ్జర్వర్ లను రంగం లోకి దింపింది ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్ష పదవికి పోటీపడుతున్న ప్రస్తుత అధ్యక్షుడు విజయకుమార్ గౌడ్ కొండూరు నారాయణ రెడ్డి శివారెడ్డి చలపతి నాయుడు సుధాకర్ రెడ్డిలతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ నిర్ణయాలను తెలిపారు కలిసికట్టుగా పంచాయతీ అధ్యక్షుల నియామకం జరగాలని సూచించారు దీంతో అందరూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెలిపారు అనంతరం మండల పరిశీలకుడు శ్రీనివాసులు నాయుడు కురిజల ఎలవ నెల్లూరు ఆర్ నడుంపల్లి పంచాయతీలలో సంస్థాగత ఎన్నికలను నిర్వహించారు కురిజల శంకర్ నాయుడు ఎలా వా నెల్లూరు గంగప్ప ఆర్ నడుంపల్లి వెంకటేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఐ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గం లోని ఓబులవారిపల్లి మండల సిపిఐ 11వ మండల మహాసభలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా రెండవ సారి సి నాగ మ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సహాయ కార్యదర్శిగా దార్ల సుధాకర్ ను ఎన్నుకున్నారు. 9 మందిని మండల కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద బడుగు,బలహీన వర్గాలకు అండగా నిలబడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ భారత కమ్యూనిస్ట్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. మండల కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా ఎన్నికకు సహకరించిన, కృషి చేసిన నాయకులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

షేక్ ఫిరోజ్‌ను పరామర్శించిన నాయకులు

విశాలాంధ్ర-మదనపల్లె: ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకు వైసిపి సీనియర్ కార్యకర్త షేక్ ఫిరోజ్ ను మదనపల్లె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పరామర్శించారు. మదనపల్లె రూరల్ కొత్తిండ్లు పంచాయతీకి చెందిన షేక్ ఫిరోజ్ ఇటువల జరిగిన ప్రమాదంలో గాయపడి, కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మదనపల్లె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఫిరోజ్ ఇంటికి వెళ్ళి పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నిస్సార్ అహమ్మద్ తోపాటు రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీ ఇర్ఫాన్, హబీబ్, బస్రీ, శంకర, షేక్ షామా, గరీబునిసా, నూరుల్లా, విజయ్, సల్మాన్, మన్సూర్, అజ్మతుల్లా, కిషోర్, యూనస్, నర్సింహులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మేకల శివార్జున, సుదర్శన్ బాబు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నూతనంగా బహుజన టీచర్స్ యూనియన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (బిటియు ఏపీ) ఏర్పాటు సమావేశం ఆదివారం ప్రెస్క్లబ్లో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షునిగా మేకల శివార్జున, ప్రధాన కార్యదర్శిగా సి.సుదర్శన్ బాబు, కోశాధికారిగా ఎ.రాజబాబు, రాష్ట్ర కార్యదర్శులుగా ఎం. గంగరాజు, కె.గంగాధర్, ఎం.శ్రీదేవి, ప్రేమ సాగర్, నిత్య ప్రభాకర్ ను ఏకగ్రీవంగా ఉపాధ్యాయులు ఎన్నుకున్నారు. వైయస్సార్ కడప జిల్లా కమిటీకి సంబంధించి జిల్లా అధ్యక్షునిగా మేంద్ర గుత్తి గంగరాజు, ప్రధాన కార్యదర్శిగా బేరి మోహన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షునిగా కట్టా గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వల్లభాయి సురేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా బి టి యు ఏ పి ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కార కోసం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తామని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విద్యాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో సమీర్ బాష, విక్టర్, సుబ్బరాయుడు, సుభాష్ బాబు, నరసింహ, డి.శ్రీనివాసులు, జయరాజు, శ్రీరాములు జయరాముడు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో మిట్స్‌కు ఏ.ఏ.ఏ రేటింగ్

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లి కు జాతీయ స్థాయి లో టాప్ 20 కళాశాల గా ఏ.ఏ.ఏ రేటింగ్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి యువరాజ్ అన్నారు. జాతీయ స్థాయిలో యెన్.పీ.టి.ఈ.ఎల్ వారు ఆన్లైన్ లో జనవరి - ఏప్రిల్ 2025 సెషన్ లో నిర్వహించిన పరీక్షలలో కళాశాల విద్యార్థులు మరియు అధ్యాపకులు మొత్తం 7108 సర్టిఫికెట్ కోర్సెస్ కు హాజరు కాగా అందులో 5747 ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి లో యెన్.పీ. టీ. ఈ. ఎల్ సర్టిఫికెట్ ను పొందడమే కాక, 200 మందికి గోల్డ్ రేటింగ్, సిల్వర్ 1191 మరియు ఎలైట్ 2419 కి లభించిందని అంతే కాకుండా కళాశాలకు రేటింగ్ తో పాటు టాప్ 20 లో మిట్స్ కళాశాల 13 వ ర్యాంక్ గా గుర్తింపు ను అందించినట్లు ఆయన అన్నారు. చెన్నై లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ (ఐఐటీ మద్రాస్) లో జరిగిన అవార్డు ల కార్యక్రమం లో అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఆర్. పృథివీరాజన్ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అన్నారు. కళాశాల కు యెన్.పీ. టీ. ఈ. ఎల్ వారు అందించిన ఈ గుర్తింపుకు కృషి చేసిన విద్యార్థులు మరియు అధ్యాపకులు చేసిన కృషికి కలశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్ విజయభాస్కర్ చౌదరి మరియు మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల విద్యార్థులు మరియు అధ్యాపకులు కు కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేషన్ విలీన గ్రామాల్లో పడకేసిన నగర పాలక పాలన

సిపిఐ పాలెం పల్లె శాఖ మహాసభలో నగర కార్యదర్శి యన్.వెంకట శివ

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పాటు చేసేటప్పుడు కలుపుకున్న విలిన పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సమస్యలు ఎక్కడికక్కడ పేరుకు పోతున్నాయని, 50వ డివిజన్ సమగ్రాభివృద్ధికి సిపిఐ ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు నగర కార్యదర్శి యన్.వెంకట శివ పేర్కొన్నారు. ఆదివారం పాలెం పల్లెలో సిపిఐ శాఖ మహాసభ మనోహర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.. మహాసభ హాజరైన వెంకటశివ మాట్లాడుతూ 50 డివిజన్‌లోని పాలెంపల్లె, రూకవారిపల్లె తదితర ప్రాంతాల్లో ఇప్పటికీ మంచినీటి సమస్య ఉండటం దారుణమన్నారు. రోడ్లు, డ్రైనేజీ మురికి కాలువల సమస్యలను తీర్చాలన్నారు. చిలకలభావి నుండి సాయిపేట, పాలెం పల్లె మీదుగా బైపాస్ రింగ్ రోడ్డు వరకు రోడ్డు వెడల్పు చేసి ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పాత కడప చెరువును హైదరాబాదు ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామన్న గత సీఎం జగన్మోహన్ రెడ్డి పక్కా దగాకోరు చేష్టలతో ఐదేళ్ల పాలనలో ఒక్క అడుగు ముందు పడలేదనీ విమర్శించారు. ఈ ప్రభుత్వంలో పాత కడప చెరువులో ఇష్టా రాజ్యాంగా మట్టి తోలుకోవడం తప్ప మరో అభివృద్ధి లేదన్నారు. ఈ ప్రాంత వాసులకు టూ టౌన్ పోలీస్ స్టేషన్ కాకుండా, చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండడం వల్ల ఇబ్బందులు ఉన్నాయని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి పాలెంపల్లె, రూకవారి పల్లె తదితర ప్రాంతాలను చేర్చి సమీప ప్రాంత వాసులకు పోలీస్ సేవలు అందించాలన్నారు.ఈ మహాసభలో పాలెం పల్లె శాఖ కార్యదర్శిగా పి.చంద్ర శేఖర్ రెడ్డి, మరో 8మందితో నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు టక్కోలి మనోహర్ రెడ్డి, అంకుశం, భాగ్యలక్ష్మి,నాగిరెడ్డి, పక్కీరప్ప, చైతన్య, ఓబులేసు, చంద్ర శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతోయువకుడు మృతి

రాయదుర్గం వాసిగా గుర్తింపు -సొంత గ్రామానికి మృతదేహం తరలింపు

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండల కేంద్ర పరిధిలోని సోమిరెడ్డి పల్లె సచివాలయం వెలుగు కాంప్లెక్స్ వద్ద అనంతపురం జిల్లా రాయదుర్గం బీసీ కాలనీ వీరభద్రపురం గ్రామానికి చెందిన పెన్నయ్య గారి తిక్క స్వామి కుమారుడు గంగాధర్ అనే యువకుడు వయసు 36 బ్రహ్మంగారిమఠం బద్వేల్ రోడ్డు సోమిరెడ్డి పల్లె సచివాలయం వద్ద ఉన్న వెలుగు షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో గంగాధర అనే యువకుడు మృత్యువాత పడ్డారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు పంచాయతీ కార్యదర్శి రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి మృతుడు వద్దన్న బ్యాగ్ పరిశీలించడంతో మృతి ఆధార్ కార్డు బ్యాంకు పాస్ బుక్ ఏటీఎం కార్డు మందుల సంచి మెడికల్ రిపోర్టర్లు పరిశీలించడంతో గంగాధర యువకుడు అనారోగ్యంతో గత నెల కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొంది సంబంధించిన మందులు తీసుకొని బ్రహ్మంగారి మఠానికి వచ్చినట్లుగా రాత్రి సమయంలో సచివాలయం సమీపంలోనే షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మృతి చెందినట్లుగా అధికారులు తెలిపారు. పోలీసులు సమాచారంతో అతను వద్ద ఉన్న సమాచారాలను అడ్రస్ ద్వారా అనంత పురం జిల్లా రాయదుర్గం వీరభద్రపురం గ్రామానికి చెందిన వారికి గుర్తించి వారి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ఓ ప్రైవేట్ అంబులెన్స్ బద్వేల్ నుండి అనంతపురానికి మృత దేహాన్ని పంపించినట్లుగా అధికారులు సమాచారం వివరాలు తెలిపారు.

బ్రహ్మంగారి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు

ప్రత్యేక అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పండుగ పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు కార్యక్రమం తో పాటు ఆలయంలో ప్రత్యేకంగా కార్యక్రమాలను ఆలయం ఫిట్ పర్సన్, శంకర్ బాలాజీ పర్యవేక్షణలో దేవస్థానం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం తెల్లవారుజాము నుండి భక్తులకు ప్రత్యేక పూజలు భజన కార్యక్రమాలను ఏర్పాటు చేసి రాత్రికి వివిధ కార్యక్రమాలను చేపట్టారు. అదేవిధంగా తొలి ఏకాదశి పండుగ పర్వదినాన ఉద్దేశించి గుంటూరు జిల్లా గణపవరం గ్రాయానికి చెందిన నాగేండ్ల మండలం సాంబశివరావు కుటుంబ సభ్యులు బ్రహ్మంగారి మఠం ఏకాదశి సందర్భంగా భక్తులకు చేపట్టారు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అదేవిధంగా ఈశ్వరి దేవి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు కార్యక్రమాలను చేపట్టారు స్వామి నివాసం గృహం పోలేరమ్మ ఆలయం బ్రహ్మ సాగర్ తిలకించి అక్కడ వెలిసి ఉన్న అవధూత నారాయణరెడ్డి స్వామి ఆలయాన్ని దర్శించుకున్నాను అక్కడ ప్రత్యేక పూజలు ఉన్నారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వైయస్ఆర్ విద్యార్థి విభాగం

రాష్ట్ర అధికార ప్రతినిధిగా సుంకర చక్రధర్

విశాలాంధ్ర - పీలేరు : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా పీలేరుకి చెందిన సుంకర చక్రధర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన గత 13 సంవత్సరాలుగా పార్టీ బలోపేతానికి కృషి చేసారు. ఈ సందర్భంగా చక్రధర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయిలో కీలక పదవి కట్టబెట్టిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డికి, యంపీ మిథున్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డికి, జిల్లా అధ్యక్షులు ఆకెపాటి అమరనాథ్ రెడ్డికి,రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ రెడ్డికి వైఎస్ఆర్ విద్యార్థి భాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంట చైతన్యకి ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికలలో వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. గ్రామ స్థాయి నుండి విద్యార్థి విభాగ కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వం చేస్తున్న వ్యతిరేక విధానాలను జనాలలోకి తీసుకెళ్లి, రాజీలేని పోరాటాలు చేస్తామని తెలిపారు.

ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2ల సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 21వ తారీకున నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా కాలంగా విద్యుత్ సంస్థలో జేఎల్ఎం గ్రేడ్-2లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారం కొరకు అనేక సార్లు విద్యుత్ యాజమాన్యం దృష్టికి మరియు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ఎలాంటి ఫలితం లేదన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా నియమితులైన జూనియర్ లైన్ గ్రేడ్2లు పూర్తిగా విద్యుత్ సంస్థలలో పనిచేయడం ప్రారంభించినప్పటి నుండి ఎప్పటికప్పుడు వినియోగదారులకు సరైన సేవలు అందుతున్నాయని ఎలాంటి అంతరాయం లేని విద్యుత్తును అందించగలుగుతున్నారని వారన్నారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కొరకు విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఏఐటీయూసీ అనుబంధ సంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలను నిర్వహించక తప్పలేదని వారన్నారు.

జల్దీతో ముగిసిన మొహరం

విశాలాంధ్ర-గాలివీడు : హిందూ ముస్లిం సోదరులు సమైక్యంగా జరుపుకునే మొహరం పండుగ ఆదివారం జల్దీ కార్యక్రమంతో ఘనంగా ముగిసింది.ఆషాఢ మాసం ప్రారంభం నెల వంక దర్శనంతో మొదలైన మొహరం పండుగ గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహించారు.శుక్ర,శని ఆదివారాల్లో పీర్ల చావిడిల ఎదుట అగ్ని గుండాలు ఏర్పాటు చేసి,అగ్ని గుండంలో కట్టెలు కొబ్బెర వంటి వస్తువులను అగ్నికి ఆహుతి ఇచ్చారు.బోరెడ్డిగారి పల్లి గుంటికాడ పల్లి అరవీడులలో మొహరం పండుగను నిర్వహించారు.పదవ రోజు సాయంత్రం గుంటికాడ పల్లి బోరెడ్డిగారి పల్లి పీర్ల కలయికతో జల్దీ కార్యక్రమంతో పీర్ల పండుగ ముగిసింది.

అపూర్వ సమ్మేళనం

విశాలాంధ్ర-వాల్మీకిపురం: వాల్మీకిపురం పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆ పాఠశాలలో 1980లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ప్రాంగణానికి చేరుకున్నారు. ఆ నాటి మధురాతి మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. వారంతా ప్రస్తుతం జీవితంలో ప్రగతిని సాధించి, వివిధ రంగాల్లో తమ ప్రత్యేకతను చాటుకున్నారు. కొంతమంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత ఉద్యోగాల్లో సేవలందిస్తుండగా, మరికొంతమంది ఉపాధ్యాయులు, వైద్యులు, వ్యాపారవేత్తలు, సేవా రంగాల్లో నిలువెత్తు ప్రతిష్టను సాధించారు. తమ పిల్లలను కూడా ఉన్నత విద్యలో స్థిరపరిచి, సమాజానికి మార్గదర్శకులుగా తీర్చిదిద్దారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో పాఠశాల స్మృతుల్లో మరొక చిరస్థాయిగా నిలిచిపోయే సంఘటనగా మారింది. ఈ కార్యక్రమంలో మాకం సుదర్శన్(అప్పల్ల), కర్రె రఘురాం, రామిశెట్టి మనోహర్, డాక్టర్ జానం గంగిరెడ్డి, సుబ్రహ్మణ్యం(గొల్ల), చింతల విజయ్ రెడ్డి, మెంటా ప్రకాష్, మాజీ ఎంపీపీ, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, వాల్మీకిపురం ఉపసర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, ఇస్రో హరినాథ శర్మ, చెక్కపని సత్యనారాయణ, పద్మలత, శైలజ, శోభారాణి, విజయ, వేణి, శ్రీలక్ష్మి, సుజాత, విద్యావతి,తదితర ప్రముఖ పూర్వ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు.

మైఫోర్స్ ఇన్‌ఛార్జ్‌గా గంగాధర్

విశాలాంధ్ర-వాల్మీకిపురం: మైఫోర్స్ పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా గంగాధర్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన సంస్థలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. కాగా ఆదివారం ఆయన నియోజకవర్గ స్థాయి బాధ్యతలు చేపట్టిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంస్థ తరఫున మరిన్ని మెరుగైన సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మైఫోర్స్ ఎప్పుడు ప్రజలకి సేవ చేసే ఉద్దేశంతో ముందుకు వెళుతుందని, త్వరలోనే పీలేరు నియోజకవర్గ, మండల కమిటీలు నియమిస్తామని మైఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు మహేష్ అన్నారు. మైఫోర్స్ విద్య అభయం అనే పేరుతో అమ్మనాన్న లేని ఆడ పిల్లలనీ చదివించడం కోసం మైఫోర్స్ విద్య అభయం అనే కార్యక్రమం చేపడుతున్నామని తల్లి దండ్రులు లేని ఆడ బిడ్డలకి మైఫోర్స్ అండగా ఉంటుందని వెల్లడించారు. కుల మత ప్రాంత బేధాలు లేని సమాజమే లక్ష్యమని గంగాధర్ తెలిపారు.

చాతుర్మాస దీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండలం వెలిగండ్ల పంచాయతీ త్రికోణ పరిధిలో వెలసిన శ్రీ వరదరాజ స్వామి ఆలయంలో ఆదివారం చాతుర్మాస దీక్షలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా ఇక్కడ నాలుగు నెలల పాటు దీక్షలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఆదివారం చేపట్టిన ఈ దీక్షలు నవంబర్ 5వ తేదీ పౌర్ణమి రోజున ముగుస్తాయని భాగవత భక్త సమాజ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ నాలుగు నెలల కాల వ్యవధిలో భాగవతం భారతం రామాయణం పట్టణం జరుగుతుందని వారు వెల్లడించారు. నిత్య హోమాధి కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని వారు తెలిపారు. లోక కళ్యాణం కోసం నిర్వహించే ఈ పవిత్ర మహోత్సవ కార్యక్రమాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు దత్త రాజ మునీంద్ర హరి హర క్షేత్ర భాగవత భక్త సమాజ అధ్యక్షులు వెన్నపూస నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిషేధం కాగితంపైనే!

సుండుపల్లెలో ప్లాస్టిక్ వ్యర్థాల కలకలం

- అమలు కాని ప్లాస్టిక్ నిషేధం
- ఇష్టారాజ్యంగా ప్లాస్టిక్ పరిశ్రమల ఏర్పాటు
- పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం
- లోపిస్తున్న పర్యావరణ స్పృహ
- పట్టించుకోని యంత్రాంగం
- పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర-సుండుపల్లె: అన్నమయ్య జిల్లా సుండుపల్లెలో ఎటు చూసినా ప్లాస్టిక్ వ్యర్థాల కుప్పలే కనిపిస్తున్నాయి. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్ వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించినా, అమలు మాత్రం కనిపించడం లేదు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లపై నిషేధం ఉన్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా వీటి తయారీ, విక్రయం, వినియోగం యథేచ్ఛగా సాగుతోంది.

అధికారుల నిర్లక్ష్యం వల్లే

సుండుపల్లెలో వ్యాపారులు నిబంధనలను గాలికొదిలి, తక్కువ మందం గల పాలిథిన్ కవర్లను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. గతంలో మున్సిపల్ అధికారులు కొన్ని వ్యాపార సంస్థలపై దాడులు నిర్వహించి, జరిమానాలు విధించినప్పటికీ, ఆ తర్వాత పరిస్థితిపై పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ వాడకం మళ్లీ పెరిగిపోయింది. ప్లాస్టిక్ తయారీ సంస్థలు కూడా నిబంధనలను ఉల్లంఘిస్తూ తక్కువ మందం గల కవర్లను రహస్యంగా ఉత్పత్తి చేస్తున్నాయి.

పర్యావరణానికి ముప్పు

నార సంచులు, పేపర్ బ్యాగులు సులభంగా కరిగిపోయే లక్షణం కలిగి ఉంటాయి. కానీ, ప్లాస్టిక్ కరిగిపోవడానికి వందల సంవత్సరాలు పట్టడంతో పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోంది. ఈ విషయంలో అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాల్సిన సమయం..

ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం కేవలం కాగితంపైనే పరిమితమైందని, అమలులో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు వాపోతున్నారు. తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్ల తయారీ, విక్రయాలపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, పర్యావరణ హితం కోసం ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే, ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి, జనజీవనానికి మరింత ముప్పుగా మారే ప్రమాదం పొంచి ఉంది.

ఒకే దేశం ఒకే జెండా ఒకే రాజ్యాంగం అని నినాదానికి నాంది పలికిన శ్యాం ప్రసాద్ ముఖర్జీ

- జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: ఆయన నిస్వార్థంగా దేశసేవ చేసిన గొప్ప నాయకుల్లో ఒకరని ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డీకే జావిద్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం (మై భారత్) కడప వారి సహకారంతో జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మై భారత్ కార్యాలయం నందు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వారి త్యాగాలు యువతకు ప్రేరణ పొంది చట్టానికి లోబడి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి కొనియాడారు. ఈ కార్యక్రమానికి మరో అతిథిగా విచ్చేసిన స్టెప్ సీఈఓ సాయి గ్రేస్ మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితం మనకు స్పష్టంగా ఒక దిశానిర్దేశం చేయడంతోపాటు దేశాభిమానం, నిబద్ధత, సత్యనిష్ఠ వంటి విలువలను ఆయన జీవితం మనకు నేర్పిస్తుందని యువత ఈ విలువలను అలవర్చుకొని దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత కలిగి ఉండాలన్నారు. మై భారత్ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ ప్రదీప్ మాట్లాడుతూ "నేటి యువతలో దేశభక్తిని పెంపొందించాలంటే శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి జీవితం ఒక శాశ్వత ఉదాహరణగా ఆయన చూపిన మార్గంలో నడవడానికి యువత సిద్ధమవ్వాలి, నెహ్రూ యువ కేంద్రం (మై భారత్) ద్వారా యువతకు అనేక అవకాశాలు ఉన్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో జేబీవీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు ఎం అశోక్, అరవింద్, ఈశ్వరయ్య, సురేంద్ర, మై భారత్ వాలంటీర్స్ ప్రేమ్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

విశాలాంధ్ర-రామాపురం: రాష్ట్రంలోనే అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించే దిశలో సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని కసిరెడ్డిగారిపల్లి గ్రామం టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, సుధాకర్, ధనుంజయ, నాగరాజు, రాజనాయక్, ధర్మయ్యలు అన్నారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లిలోని సూర్యనారాయణపురం రాచపల్లి చిట్లూరు గ్రామాల్లో ఆదివారం టిడిపి నాయకులు సంవత్సర పాలనలో చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలన్నీ అర్హులకే అందియాలా ప్రభుత్వం లక్ష్యంగా ప్రయాణిస్తుంది అన్నారు. లో కుటుంబంలో ఎంతమంది ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లి వందనం ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలను త్వరలో చేపడుతున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరహరి వెంకటరమణ గంగయ్య ఎల్లయ్య సుబ్బరాయుడు వెంకటయ్య వెంకటేశులు పాల్గొన్నారు.

సౌమ్యనాథ స్వామిని దర్శించుకున్న కోడూరు ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నందలూరు: సౌమ్యనాథ స్వామిని కోడూరు ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్ దర్శించుకున్నారు. ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికిన టిటిడి అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు. ఆర్టీసీ ఎక్స్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, టెంపుల్ ఇన్స్పెక్టర్ దిలీప్, చక్రాల సాయినాథ్, సుబ్బరామయ్య, వంశీకృష్ణ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చీర్ల సురేష్ యాదవ్‌కు కీలక పదవి

విశాలాంధ్ర-చెన్నూరు: వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ ప్రధాన కార్యదర్శిగా కమలాపురం నియోజకవర్గం చెన్నూరు మండలానికి చెందిన చీర్ల సురేష్ యాదవ్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నన్ను ఈ పదవికి ఎంపిక చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి, కడప ఎంపీ వైఎస్.అవినాష్ రెడ్డికి, కమలాపురం ఇంఛార్జ్ నరేన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నన్ను ఈ పదవికి నియమించినందుకు పార్టీ అధిష్ఠానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు పార్టీ అధిష్ఠానం నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయక పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వచ్చే ఎన్నికలలో విజయమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన తెలిపారు.

త్యాగానికి ప్రతీక మొహరం

- వీఆర్డీఎస్ సురేంద్రారెడ్డి

విశాలాంధ్ర-వీరబల్లి: త్యాగానికి ప్రతీకగా మొహరం నిర్వహిస్తారని వీఆర్డీఎస్ సురేంద్రారెడ్డి తెలిపారు. వీరబల్లి గ్రామంలో మొహరం పురస్కరించుకొని పుత్తవాండ్ల పల్లికి చెందిన సిరిగిరి కుళాయిరెడ్డి, చంద్రమ్మ దంపతులు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. అవంచనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై నరసింహారెడ్డి బందోబస్తు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఎస్సైని శాలువాతో సత్కరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

- సిపిఐ పిలుపు

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సిపిఐ అన్నమయ్య జిల్లా నాయకులు తుమ్మల రాధాకృష్ణ, పి మహేష్ పిలుపునిచ్చారు. ఓబులవారిపల్లి మండలంలోని మంగంపేట గ్రామపంచాయితీ పరిధిలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఆదివారం జరిగిన ఓబులవారిపల్లి 11 వ మండల మహాసభలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అండగా నిలబడి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసి సాధించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాల ద్వారానే ప్రభుత్వాల మెడలు వంచి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. వర్గ దోపిడిని అంతమొందించేందుకే భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ ఆవిర్భవించిందన్నారు. కమ్యూనిస్టుపార్టీ పేదల పక్షాన నిలబడి ఎన్నో మహత్తర పోరాటాలు చేసి వేలాది ఎకరాల భూములను నిరుపేదలకు పంచిపెట్టిన ఘనత సిపిఐ కే దక్కిందన్నారు. సమసమాజ స్థాపనే సిపిఐ లక్ష్యం అన్నారు. తెలుగుదేశంపార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే వాటిని పగలగొట్టండి అని నారా లోకేష్ బాబు అన్నారన్నారు. మరి మీరు స్మార్ట్ మీటర్లు ఎందుకు బిగిస్తున్నారని నిలదీసి ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ చేపట్టే ఉద్యమాల వల్ల ప్రభుత్వాలకు భయం పుట్టిందన్నారు. వాగ్దానాలే తప్ప ఆచరణ శూన్యం విమర్శించారు. కార్మికుల కోసం, కర్షకుల కోసం పోరాడేది కమ్యూనిస్టు పార్టియే అన్నారు. ఈ మహాసభలో సిపిఐ నాయకులు జ్యోతి చిన్నయ్య, తుమ్మల రాధాకృష్ణ, మాదిరాజు గంగాధర్, శివరామకృష్ణ దేవర, మోడి శివయ్య, దార్ల రాజశేఖర్, నాగేశ్వరరావు, ఎం జయరామయ్య, కృష్ణవేణి, రోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాజానికి దార్శనికుడు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలంలోని పరిధిలోనే కార్యదర్శి గంగి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ గారి 39వ వర్ధంతి సందర్భంగా బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు అజయ్, నాయకులు శ్రీను, రమేష్‌లు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-గాలివీడు: భార్య కాపురానికి రాలేదని తుపాకుల గోపాల్(37) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు అరవీడు గ్రామం మలసానివాండ్లపల్లెకు చెందిన తుపాకుల వెంకటరమణ, రమణమ్మ దంపతుల కుమారుడు మృతుడు గోపాల్ మద్యానికి బానిసై భార్య రమణమ్మ, నలుగురు సంతానాన్ని నిర్లక్ష్యం చెయ్యడంతో భార్య మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్ళింది. దీంతో మనస్తాపం చెందిన గోపాల్ తన భార్య తిరిగి కాపురానికి రాదేమోనన్న సందేహంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మృతుడు తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం: ఏఐటియుసి

విశాలాంధ్ర-కడప రూరల్: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను 4 లేబర్ కోడ్‌లను పెంచిన పది గంటల పనివిధానం మూలంగా కార్మిక హక్కులు హరించే విధంగా ఉన్నాయని వీటిని రక్షించుకునేందుకు జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని రైల్వే గూడ్స్ షెడ్ హమాలి యూనియన్ ఏఐటియుసి అధ్యక్ష కార్యదర్శులు కెసి.బాదుల్లా ఎస్ మహబూబ్ బాషా పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక కడప రైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్ యూనియన్ కార్యాలయంలో సార్వత్రిక సమ్మె సంబంధించిన కరపత్రాలు విడుదల చేసి వారు మాట్లాడుతూ కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా బిజెపి మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని ఆ మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షెడ్ హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్, శ్రీను, చిన్న ఓబులేసు, నాగేంద్ర, సూరి, సుబ్బరామ్, రంగనాయకులు, మల్లి పాల్గొన్నారు.

జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు

విశాలాంధ్ర-నందలూరు: జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందని పశు వైద్యాధికారి ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ జంతువుల నుండి మనుషులకు, మనుషుల నుండి జంతువులకు సంక్రమించు వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అని పిలుస్తారు అని తెలిపారు. ఈ వ్యాధులు సుమారు 280 వరకు గుర్తించబడ్డాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవో సుగుణ, వీఏ సుదర్శన్ రెడ్డి, ఏహెచ్ఏ జాహ్నవి, శివ రామ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా బత్యాల జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్ రాయులు 70వ జన్మదినోత్సవ వేడుకలు ఆదివారం శ్రీగంగమ్మతల్లి బత్యాల భవన్‌లో ఆయన అభిమానుల అధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శ్రీగంగమ్మతల్లికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. పసందైన అల్పాహారం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరాన్ని చేపట్టారు. పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అధికారులు, అనధికారులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జూనోసెస్ దినోత్సవం సందర్భంగా అవగాహనా సమావేశం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణ ఆరోగ్య కేంద్రం శ్రీరాములపేట నందు ప్రపంచ జూనోసెస్ దినోత్సవం సందర్భంగా అవగాహనా సమావేశం నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప జిల్లా మరియు ఆరోగ్య శాఖాధికారి డా.గీత పాల్గొన్నారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ 2025 సంవత్సరం నుండి పెరుగుతున్న జూనోటిక్ వ్యాధి ప్రమాదాలను హైలైట్ చేస్తుంది మరియు వన్ హెల్త్ విధానాన్ని ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రపంచ జూనోసెస్ డే పాశ్చర్ యొక్క రాబిస్ టీకా జ్ఞాపకార్థం మరియు ప్రపంచ నివారణ, అవగాహన మరియు సహకార ప్రయత్నాలను ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రపంచ జూనోసెస్ దినోత్సవ నినాదాలు ఏవనగా ఒకే ప్రపంచం, ఒకే ఆరోగ్యం, జూనోసిస్‌ను నిరోధించండి! వ్యాప్తిని ఆపండి-జూనోటిక్ వ్యాధులను నియంత్రించండి! జంతువులను రక్షించండి, జూనోసిస్‌ను నివారించండి! సురక్షితమైన జంతువులు, ఆరోగ్యకరమైన ప్రజలు, జూనటిక్ వ్యాధి అనేది సకశేరుక జంతువుల నుండి మానవులకు లేదా మానవుల నుండి సకశేరుక జంతువులకు సహజంగా సంక్రమించే వ్యాధి లేదా సంక్రమణం అన్నారు. మానవ వ్యాధికారక క్రిములలో 60శాతం కంటే ఎక్కువ జూనోటిక్ మూలం. ఇందులో అనేక రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు, శిలీంధ్రాలు, ప్రోటోజోవా, పరాన్నజీవులు మరియు ఇతర వ్యాధికారక క్రిములు ఉన్నాయని, కావున జంతువుల నుండి సంక్రమించే వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించి ఆరోగ్యంగా వుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా.భరత్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి కుటుంబ సభ్యునికి అండగా ఉంటాం

- వెంకట సుబ్బయ్యను పరామర్శించిన చమర్తి

విశాలాంధ్ర-నందలూరు: మండలం ఆడపూర్ కు చెందిన టీడీపీ కుటుంబ సభ్యుడు వెంకట సుబ్బయ్య క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో ఆదివారం రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజుగారు వెంకటసుబ్బయ్య గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి రూ 50 వేల ఆర్థిక సహాయాన్ని తక్షణ సాయం కింద అందజేశారు. అలాగే తెలుగుదేశం క్రియాశీల కార్యకర్త అయిన వెంకటసుబ్బయ్య కుటుంబానికి ధైర్యం చెబుతూ తమ కుటుంబ సభ్యుడు, టిడిపి వ్యతిరేక పార్టీలతో ఎప్పుడు పోరాడి టిడిపికి అండదండగా నిలిచిన వ్యక్తి అనారోగ్య బారిన పడడం బాధాకరమని, వెంటనే వెంకటసుబ్బయ్య సమస్య అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పార్టీ పరంగా ప్రభుత్వపరంగా అన్ని విధాల అండగా ఉంటామని, అలాగే స్థానిక నాయకత్వం కూడా ఎప్పటికప్పుడు వెంకటసుబ్బయ్య ఆరోగ్య పరిస్థితిని గమనించి సహాయ సహకారాలు అందించాలని, అందుకు తాను ఎల్లప్పుడూ తోడుగా ఉంటాను అని చమర్తి తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో నందలూరు మండల టిడిపి అధ్యక్షుడు జంగం శెట్టి సుబ్బయ్య, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరు వేణుగోపాల్, క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, రాజంపేట టిడిపి రూరల్ అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, టిడిపి నాయకులు నాగయ్య నాయుడు, మేకల బాబు, షేక్ కరీముల్లా, కొప్పల గోవింద్, రమణ, రవి, రామయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం: ఛైర్మెన్

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: మొహరం పండుగ మత సామరస్యానికి ప్రతీక అని కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. మొహరం పండుగ సందర్భంగా ఆదివారం పుల్లంపేట మండలంలోని దళవాయిపల్లి గ్రామ పంచాయితీలోని కేతరాజపల్లి గ్రామంలో వెలసిన గంధపు పీర్లకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ ధర్మపరి రక్షణ, శాంతియుత సమాజ స్థాపన కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన ప్రాణ త్యాగం మానవాళికి దివ్య సందేశాన్ని అందిస్తోందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సింగమాల విశ్వనాథ రెడ్డి, మహేందర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, కృష్ణమనాయుడు, స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మోటకట్ల గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమం

విశాలాంధ్ర-సంబేపల్లె: సుపరిపాలనలో తొలి అడుగు ఐదవరోజు ఇంటింటికీ కూటమి ప్రభుత్వం చేసిన మేలును డోర్ టు డోర్ ప్రచారం పెంచి ఇస్తున్న పెన్షన్లు, చదివే పిల్లలు అందరికీ ఇచ్చిన తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, గురించి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల టిడిపి అధ్యక్షుడు చిన్న రెడ్డయ్య యాదవ్, టిడిపి నాయకుల ఆధ్వర్యంలో జానం వాండ్లపల్లి, చెరువుకిందపల్లి గ్రామాలలో డోర్ టు డోర్ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు నెలలో అమలు చేయడం జరుగుతుందన్నారు. జూలై నెలలోనే రైతులకు రైతు భరోసా నిధులు వారి అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వంగిమల్ల శివ ప్రసాద్ రెడ్డి, మాజీ సంబేపల్లె అధ్యక్షుడు చిన్నా రెడ్డయ్య యాదవ్, యూనిట్ కో కన్వీనర్ జానం నంద యాదవ్, బూత్ కో కన్వీనర్ లోకేష్ యాదవ్, క్లస్టర్ కో కన్వీనర్, రాయచోటి నియోజకవర్గం ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు హరి యాదవ్, బూత్ కన్వీనర్ మల్లిఖర్జున రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రసన్న కుమార్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, పూజల ఓబులేశ్ యాదవ్, గురు యాదవ్, కార్తీక్ రెడ్డి, సీ.ఎం రమణ, తిమ్మ రెడ్డి, దాసరి నాగరాజ, శంకర్ రెడ్డి,కార్యకర్తలు, గ్రామ ప్రజలు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఇంటింటికి తెలపాలి

కడప నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : "బాబు షూరిటీ-మోసం గ్యారంటీ" చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కడప నగరంలోని యూ ఎస్ మహల్ కళ్యాణ మండపం నందు వైయస్సార్సీపి కడప నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.బి.అంజాద్ భాష ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. వైయస్సార్ సిపి పార్టీ జిల్లా అధ్యక్షులు .రవీంద్రనాథ్ రెడ్డి, కడప నగర మేయర్ కే.సురేష్ బాబు, పార్టీ పరిశీలకులు కొండూరు అజయ్ రెడ్డి , డిప్యూటీ మేయర్లు ముంతాజ్ జమాల్ వలి , నిత్యానంద రెడ్డి, డాక్టర్ సొహైల్ అహ్మద్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 ఎన్నికల మేనిఫెస్టో లో చంద్రబాబు ఇచ్చినటువంటి హామీలను గుర్తు చేస్తూ ప్రజలను వంచిస్తున్న తీరును వివరిస్తూ పార్టీ రూపొందించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ స్కాన్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కడప నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి నాయకులు, జిల్లా స్థాయి నాయకులు,పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా బత్యాల జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్ రాయులు 70 వ జన్మదినోత్సవ వేడుకలు ఆదివారం శ్రీగంగమ్మతల్లి బత్యాల భవన్ లో ఆయన అభిమానుల అధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శ్రీగంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు.పసందైన అల్పాహారం ఏర్పాటు చేశారు.రక్తదాన శిబిరాన్ని చేపట్టారు. పార్టీల కతీతంగా అభిమానులు, శ్రేయోభిలాషులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి బత్యాలకు శాలువా కప్పి పూలమాలవేసి స్వీట్లు తినిపించి అభిమానాన్ని చాటుకున్నారు.వచ్చిన అభిమానులను అదుపు చేయడం సాధ్యం కాలేదు.బత్యాల భవన్ వద్ద పండుగ వాతావరణం తలపించింది.బాణాసంచా పేల్చారు. అభిమానులు ప్రధాన కేంద్రాల వద్ద పోటాపోటీగా పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అభిమా నాన్ని చాటుకున్నారు.పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అధికారులు, అనధికారులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు తరలి వచ్చి బత్యాలకు హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అభిమానాన్ని చాటుకున్నారు.

ఘనంగా మొహరం వేడుకలు

విశాలాంధ్ర ముద్దనూరు : మండలంలో పెద్ద ఎత్తున మొహరం ఉత్సవాలు ప్రతి సంవత్సరం నిర్వహించగా ఈసారి కూడా పెద్ద ఎత్తున నిర్వహించారు. పీర్లను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున పీర్ల చావిడికి వచ్చారు. మండలంలో కుల, మతాలకతీతంగా శనివారం రాత్రంతా మొహరం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన పీర్లకు ఆయా గ్రామాల్లో భక్తులు పూలు, దట్టీలు సమర్పించారు. పలు గ్రామాల్లో రాత్రివేళ మహిళల ఆటపాటలతో సంప్రదాయ నృత్యాలు చేశారు. హిందువులు, ముస్లింలు కలిసికట్టుగా పీర్ల ఎదుట డప్పుల చప్పుడులతో ఆడిపాడిన అలయ్ బలయ్ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. తెల్లవారుజామున మొహర్రం వేడుకల్లో భాగంగా పీర్ల సవారీతో గ్రామ వీధుల్లోకి రాగా భక్తులు దారిపొడవునా నీరుపోసి మొక్కులు తీర్చుకున్నారు. తదితరులు దర్శించుకున్నారు. పీర్ల ఊరేగింపు ముందు యువకులు, మహిళలు ఆటా, పాటలతో అలరించారు.పీర్లు ఎత్తుకున్నవారు పీర్ల ఊరేగింపులో పూనకాలతో ఊగిపోయారు. భక్తులు పీర్లకు దట్టీలు, ప్యాతాలు సమర్పించారు. సాయంత్రం పీర్లను నిమజ్జనం చేశారు. నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మీ సంక్షేమం మా భరోసా..

వైబియన్ పల్లిలో ఇంటింటికి సుపరిపాలన తొలి అడుగు

ఇంటింటికి సుపరిపాలన పై అవగాహన కల్పించిన చమర్తి జగన్ మోహన్ రాజు

విశాలాంధ్ర -రాజంపేట: మీ సంక్షేమం మా బాధ్యత అంటూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాజంపేట టీడీపీ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు రాజంపేట మండలం, కూచి వారి పల్లి పంచాయతీ వైబియన్ పల్లిలో ఇంటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమము యొక్క కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు పేరుతో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు గురించి ప్రజల అభిప్రాయాలు తీసుకుని రాబోయే కాలంలో మరింత మెరుగైన పాలన సాధించేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన లభిస్తుందని, రాబోయే రోజుల్లో మరింత మెరుగైన పాలన అందించి 2029 ఎన్నికల్లో మరోసారి టిడిపి జెండా ఎగరేల కృషి చేస్తామని ఆయన తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట రాజంపేట టిడిపి రూరల్ అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దివాకర్ నాయుడు, బూత్ కన్వీనర్ బాసినేని సుబ్రహ్మణ్యం నాయుడు, యూనిట్ ఇంచార్జ్ ముల్ల గోరి సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ టిడిపి అధ్యక్షులు బాపనయ్య నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, కమ్మ సంఘం అధ్యక్షుడు, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ టెక్కోళ్ళ మల్లికార్జున్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డియ్య నాయుడు, మేడికొండు రవి నాయుడు, దగ్గుపాటి వెంకటేశ్వర్ల నాయుడు, సర్పంచ్ హరి, ఉప సర్పంచ్ మల్లికార్జున నాయుడు, పోతు గుంట జయరాం నాయుడు, నన్నపనేని సుబ్బరాయుడు, నరసయ్య నాయుడు, సుబ్బయ్య నాయుడు, దేవరాజు నాయుడు, మేక నరసింహనాయుడు, కళాధర్, సురేంద్ర, ఎం శంకర్రాజు, వేణుగోపాల్ నాయుడు, రెడ్డయ్య, జయరామయ్య, తారక్, కొల్లపనేని వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు నాయుడు పలువురు టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మెను విద్యుత్ కార్మికులు జయప్రదం చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పొన్నా శివయ్య

విశాలాంధ్ర-యర్రగుంట్ల : జూలై 9న జరగబోయే సార్వత్రిక సమ్మెను విద్యుత్ రంగ కార్మికులు శతవిజయంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పొన్నా శివయ్య అన్నారు. ఎర్రగుంట్లలో విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2003 విద్యుత్ చట్టానికి సవరణలు తెచ్చే పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ వైపు నెట్టేస్తోందని, ఇది లక్షలాది కార్మికుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే కుట్ర అని అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థల్ని విడగొట్టి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఉత్తరప్రదేశ్, చండీగఢ్‌లలో ఇప్పటికే డిస్కంలను ప్రైవేటు సంస్థలకు అప్పగించినట్లే, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆదానీ గ్రూప్ వంటి కార్పొరేట్ కంపెనీలకు విద్యుత్ పంపిణీ బాధ్యతలు అప్పగించే ప్రక్రియ మొదలైందని తెలిపారు. ఈ విధానం వల్ల విద్యుత్ సేవలు ప్రజలకు మౌలిక హక్కుగా కాక, కార్పొరేట్ లాభాల కోసం సరఫరా అయ్యే వస్తువుగా మారుతుందని, ప్రజలకు అధిక ధరలు, నాసిరకం సేవలు తప్ప వేరేమీ ఉండబోవని స్పష్టం చేశారు. ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా తొలగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇక 2003 విద్యుత్ చట్ట సవరణలు కేవలం పంపిణీ వ్యవస్థ ప్రైవేటీకరణకే కాక, విద్యుత్ రంగంలో కార్మికుల ఉద్యోగ భద్రతను కూడా భగ్నమంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులంతా ఒకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్మికుల హక్కులను రద్దు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని అన్నారు. ఈ లేబర్ కోడ్‌లు యాజమాన్యాలకు అనుకూలంగా ఉండే విధంగా రూపొందించబడ్డాయని, ఇవి కార్మికులను బానిసలుగా మార్చే విధానానికి నాంది అని విమర్శించారు. కనీస వేతనాలు, పని గంటల నియంత్రణ, కాంట్రాక్టు ఉద్యోగుల హక్కులు – అన్నింటినీ తొలగించేందుకు వీటిని వినియోగిస్తున్నారని ఆరోపించారు. జూలై 9 సమ్మె కార్మికుల పక్షాన గళంగా మారాలని పిలుపునిస్తూ, విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు ఉద్యమంలో పాల్గొనాల్సిన అవసరం ఉందని చెప్పారు. "ఈ సార్వత్రిక సమ్మె కేవలం ఒక డిమాండ్ ఉద్యమం కాదు ఇది కార్మికుల మీద పడి వచ్చే నల్ల మేఘాలపై సమిష్టిగా గర్జించే తుఫాను కావాలి," అని అన్నారు.

శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రతేక పూజలు

విశాలాంధ్ర - సుండుపల్లి : మండలం ఆరోగ్యపురంలో వెలిసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం తొలి ఏకాదశి శుభ సందర్భంగా అర్చక స్వామి అమ్మనాయక్ స్వామివారికి పూల అలంకరణ అనంతరం నైవేద్యం సమర్పించడం జరిగినది. వచ్చిన భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. తరువాత స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం తీర్థప్రసాద ఇవ్వడం జరిగినదన్నారు.

దేశ ఐక్యత ఆశయ సాధనకు

కృషి చేసిన మహోన్నత వ్యక్తి డా.శ్యామ ప్రసాద్ ముఖర్జీ

విశాలాంధ్ర -రాజంపేట: దేశ ఐక్యత ఆశయ సాధన కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్ నాయుడు అన్నారు. ఆదివారం రాజంపేట లోని బిజెపి కార్యాలయంలో జనసంఘ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంద్యాల జిల్లా ఇన్చార్జి పోతు గుంట రమేష్ నాయుడు మాట్లాడుతు భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, దేశ ఐక్యత ఆశయ సాధనకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి "డా.శ్యామ ప్రసాద్ ముఖర్జీ"అని అన్నారు . ఏక్ దేశ్ మే దో విధాన్, దొ ప్రధాన్, థో నిషాన్ నహీ చెలెంగ అని నినదించి సమోన్నత సమైక్య భారత్ కోసం పోరాటం చేసిన మహోన్నత దేశభక్తుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ.అని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ బిజెపి రాష్ట్ర నాయకులు హిమగిరి యాదవ్ బిజెపి మండల ఉపాధ్యక్షులు వేణు ప్రసాద్ రాజు పట్టణ ఉపాధ్యక్షులు రమణారెడ్డి పార్లమెంట్ నాయకులు తోట నగేష్ పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి చేసిన కృషి మరువలేనిది

విశాలాంధ్ర-కొండాపురం: డాక్టర్ బాబు జగజ్జీవన్ రావు 39వ వర్ధంతి సందర్భంగా కొండాపురం నందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి దళిత సంఘం నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం డాక్టర్ బాబు జగజ్జీవన్ రావు చేసిన కృషి మరువలేనిదని, సామాజిక సమానత్వం కోసం శ్రమించిన మహనీయుడు అని కొనియాడారు. దళితులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ముందుకెళ్లేలా పోరాడిన యోధుడు అని ఆయన సేవలను కొనియాడారు. అదేవిధంగా కొండాపురం నందు దళితుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ కార్యదర్శి నాగ సుబ్బారాయుడు, నారాయణ, శ్రీనివాసులు, నాగన్న కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు

ఘనంగా గుండాపురంలో మోహరం

కులమతాలకు అతీతంగా గ్రామంలో పండుగ వాతావరణం

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండలంలోని చౌదరి వారి పల్లి పంచాయతీలోని గుండాపురం గ్రామంలో కులమతాలకు అతీతంగా గ్రామంలో భక్తిశ్రద్ధలతో మోహరం పీర్ల పండగను వైభవంగా నిర్ణయించారు. ఆదివారం ప్రత్యేకంగా ప్రార్ధనలు పాల్గొని గ్రామమంతా పీర్ణ ఊరేగింపు కార్యక్రమాన్ని కులుకు భజనలు కోలాటాలతో భక్తులను ఆకట్టుకుండే విధంగా గ్రామం అంతా పండగ వాతావరణం చేపట్టారు. గత మూడు రోజుల నుండి అంగరంగ వైభవంగా గ్రామమంతా కులమతాలకు అతీతంగా ఫీల్డ్ సావిటి వద్దకు వెళ్లి ప్రతిరోజు కార్యక్రమాలు సాంస్కృతి కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను కులమత అతీతంగా భక్తి శ్రద్ధతో మోహరం కుల పెద్దలు గ్రామ పెద్దల కలిసి అంగరంగ వైభవంగా పిర్ణను ఊరేగింపు రాష్ట్ర అవార్డు గ్రహీత తగిలి పుల్లయ్య భజన బృందం తో భజన కోలాటం కార్యక్రమాలను నిర్ణయించారు.

అభివృద్ధి సంక్షేమం చంద్రబాబు నాయుడుకి రెండు కళ్ళు

విశాలాంధ్ర- రాయచోటి : రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచన మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు. ఆదివారం రామాపురం కొత్తపేట వార్డుల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజల్లో ఉన్న భయం అశాంతి పోయి ఒక భరోసా ప్రశాంతత వచ్చింది అన్నారు రామాపురం నందు గత ప్రభుత్వంలో సక్రమమైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతుంటే వెంటనే మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి. తీసుకురాగా ఆయన రోడ్డు వేయించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన అమ్మ ఒడి అరకొర ఇచ్చి మోసం చేస్తే చంద్రబాబు నాయుడు ఇంట్లో ఎంతమంది ఉన్న అందరికీ తల్లికి వందనం కింద 15000 రూపాయలు ఇవ్వడం జరిగిందని చెప్పారు. గత ప్రభుత్వంలో పెన్షన్ కేవలం 250 రూపాయలు పెంచితే చంద్రబాబు నాయుడు ఏకంగా వెయ్యి రూపాయలు పెంచి ఇవ్వడం జరిగింది అని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రజలకు స్వేచ్ఛ ప్రశాంతత కలిగి మంచి ప్రభుత్వం వచ్చిందని ప్రజల నోట వినిపిస్తున్న మాట ఇదే అన్నారు ధాన్యం రైతులకు గత ప్రభుత్వం పెట్టిన 1600 కోట్ల బకాయిలను తెలుగుదేశం ప్రభుత్వం తీర్చిందన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకుల బలరాం మల్లికార్జున , తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

నల్లగంగమ్మ తల్లికి బంగారు గొలుసు బహుకరణ

విశాలాంధ్ర-సంబేపల్లె: సంబేపల్లె గ్రామంలో వెలసిన శ్రీదేవరరాయి నల్లగంగమ్మ తల్లికి 8 గ్రాముల బంగారు గొలుసును సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లెకు చెందిన గుత్తా సత్యనారాయణ నాయుడు, సుశీల దంపతులు బహుకరించారు. ఆదివారం దాతలు అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు గావించారు. ఆలయ పూజారులు వారిచేత పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు దంపతులను సత్కరించారు. తొలి ఏకాదశి సందర్భంగా దేవర రాయి నల్ల గంగమ్మ ఆలయం భక్తులతో పోటెత్తింది. ఏకాదశి పురస్కరించుకొని విశేషంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పథకాలు ఇంటింటికీ అందాయా లేదా గుర్తించి తీర్చడమే తొలి అడుగు లక్ష్యం

చైర్మెన్ ముక్కా రూపానందరెడ్డి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ఇంటింటికీ అందాయా లేదా గుర్తించి తీర్చడమే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి పేర్కొన్నారు.ఆదివారం పుల్లంపేట మండలం లోని దళవాయిపల్లి గ్రామపంచాయతీలోని కేతరాజపల్లి గ్రామంలో తెలుగుదేశంపార్టీ అద్వర్యంలో చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి భావితరాలకు భవిష్యత్తు కల్పించారన్నారు.రాష్ట ప్రభుత్వానికి ఆర్దిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం దశల వారీగా నెరవేర్చుతున్నామన్నారు.ప్రభుత్వం చిత్త శుద్ధిని చాటుకుందన్నారు. ప్రజలకు అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాల పట్ల స్థానిక ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అడుగడుగునా స్థానికుల నుంచి ఆత్మీయ ఆహ్వానాలు పలుకుతూ గ్రామస్తులు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సింగమాల విశ్వనాధ రెడ్డి, మహెంధర్ రెడ్డి,సిపి సౌభాగ్య,మల్లిఖార్జున రెడ్డి,పొన్నాటి వాసుదేవరెడ్డి, కృష్ణమనాయుడు స్థానిక ప్రజలు, కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రెవిన్యూ శాఖలో సమస్యలకు త్వరలోనే పరిష్కారాలు

విశాలాంధ్ర-రాయచోటి : రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన అధికారులు మరియు ప్రజల ఇచ్చిన అర్జీలు స్వీకరించి, వారి సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలను సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ పరంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. అలాగే క్యాంపు కార్యాలయంలో మంత్రి బి .రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి మరియు కొత్తపురమ్మ తల్లి దేవస్థానం ట్రస్టు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి దుశాలవాలతో పుష్పగుచ్చంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూలకుంట సర్పంచ్ పార్థసారథి రెడ్డి మరియు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

సిపిఐ ఆద్వర్యంలో విరాళాల సేకరణ

విశాలాంధ్ర - బద్వేలు : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కడప జిల్లా 25వ మహాసభలు ఈనెల 22 నుండి 24 వరకు బద్వేల్ పట్టణంలో జరుగుతున్న సందర్భంగా ఆదివారం పట్టణంలోని పలు వీధులలో గడపగడపకు పోయి సిపిఐ శ్రేణులు విరాళాలు సేకరించే కార్యక్రమాన్ని జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.16 సంవత్సరాల తర్వాత ఈ నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహాసభలు జరుగుతున్నాయని ఇప్పటికే జిల్లా మహాసభలు జయప్రదానికి అందరూ సహకరిస్తున్నారని అయితే నిరంతరం ప్రజా సమస్యలే పరమావధిగా పనిచేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల నుండి విరాళాలు సేకరించి ఈ మహాసభల నిర్వహణకు ఖర్చు చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పెద్దులపల్లె బాలు సహాయ కార్యదర్శి పొంగూరు నాగరాజు ఏరియా కార్యవర్గ సభ్యులు పి.వి రమణ ఇమ్మానియేల్ పడిగే వెంకటరమణ విజయమ్మ పట్టణ నాయకులు నాగసుబ్బయ్య రమణయ్య రవి నరసయ్య రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు

విశాలాంధ్ర -నందలూరు : జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందని పశు వైద్యాధికారి ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ జంతువుల నుండి మనుషులకు, మనుషుల నుండి జంతువులకు సంక్రమించు వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అని పిలుస్తారు అని తెలిపారు. ఈ వ్యాధులు సుమారు 280 వరకు గుర్తించబడ్డాయి అని అన్నారు. ప్రతి సంవత్సరం జూలై ఆరో తేదీన రేబిస్ వ్యాధి టీకాలను వేయడం జరుగుతోందని అన్నారు. జంతువుల పోషకులకు జూనోటిక్ వ్యాధుల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేవివో సుగుణ, వివి సుదర్శన్ రెడ్డి, ఏ్ణహెచ్ఏ జాహ్నవి, శివరామ్‌లు పాల్గొన్నారు

హంస వాహనంపై సౌమ్య నాధుని దర్శనం

విశాలాంధ్ర నందలూరు: ఉమ్మడి కడప జిల్లాలో చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిన నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం ఉదయం పల్లకి సేవ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు సునీల్ కుమార్, పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్ కుమార్, మనోజ్ కుమార్, సాయి స్వామి ఆధ్వర్యంలో అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాధుడు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంపై సరస్వతీ దేవి అలంకారంలో శ్రీ సౌమ్యనాధుడు శ్రీదేవి భూదేవి తో కలిసి మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్నెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు. కిటకిటలాడిన సౌమ్యనాథ స్వామి ఆలయం నందలూరు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శనానికి తరలివచ్చారు. క్యూ లైన్లు భక్తులతో నిండి పోయి ఆలయం కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు

ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు సోమవారం ఉదయం పల్లకిసేవ ,గ్రామోత్సవం, తిరుమంజనం . రాత్రికి సింహ వాహనంపై సౌమ్యనాథ స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

త్యాగానికి ప్రతీక మొహరం

విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి

విశాలాంధ్ర - వీరబల్లి : త్యాగానికి ప్రతీకగా మొహరం నిర్వహిస్తారని విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి తెలిపారు. వీరబల్లి గ్రామంలో మొహరం పురస్కరించుకొని పుత్తవాండ్ల పల్లికి చెందిన సిరిగిరి కుళాయిరెడ్డి, చంద్రమ్మ దంపతులు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా కుళాయి రెడ్డి మాట్లాడుతు ప్రతి యేటా గంధం సమర్పణలో భాగంగా ఈ సారి కూడ గంధం తీసుకుని వచ్చి పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీర్ల కమిటీ సభ్యులు కుళాయిరెడ్డి దంపతులను ఘనంగా శాలువాతో సత్కరించారు. పీర్ల ఊరేగింపు, అగ్నిగుండం ప్రవేశం అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై నరసింహారెడ్డి బందోబస్తు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఎస్సైని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అపూర్వం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటి: రాయచోటి పట్టణం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సేవలు అపూర్వమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. స్థానిక పిసిఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్స్ లయన్ యం.గౌతమ్, లయన్ కె.చిన్నప్పరెడ్డి,లయన్ యం.సుధాకర్ రెడ్డి, లయన్ జె.చంద్రప్రకాష్ రావ్, డా.కె.బయారెడ్డి, డా.పి.నారాయణ రెడ్డి, మానవతా జిల్లాధ్యక్షుడు ఏ.శివగంగిరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ నాలుగు జిల్లాల్లో మొదటి స్థానంలో సేవ కార్యక్రమాలు చేస్తూ ఈ సంవత్సరం అధ్యక్షుడు లయన్ పి.శివారెడ్డి ఆధ్వర్యంలో 460 కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయమని అలాగే రాబోయే రోజులలో కూడా నూతన అధ్యక్షుడు లయన్ శ్యామ్ కూడా ఇంకా మంచి కార్యక్రమాలు చేసి రాయచోటి ప్రజల మన్ననలు పొందాలని తెలియజేశారు. అనంతరం 2024-2025 అధ్యక్షుడు లయన్ పి.శివారెడ్డి మాట్లాడుతూ నాకు ఇంత గొప్ప అవకాశం కల్పించిన క్లబ్బు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో కూడా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. అనంతరం పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ యం.సుధాకర్ రెడ్డి అధ్యక్షులుగా లయన్ పి.శ్యామ్, కార్యదర్శిగా లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్, కోశాధికారిగా లయన్ కె.మనోహర్ రాజు, కొత్త సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్విస్ట్ చైర్మన్ లయన్ పి.ఎస్.హరినాథ్ రెడ్డి, రీజినల్ చైర్మన్ లయన్ షేక్. మహమ్మద్, జోన్ చైర్మన్ లయన్ వెంకట సుబ్బయ్య, లయన్స్ కుటుంబ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-పులివెందుల: ప్రభుత్వం గురుకుల పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పునరుద్ఘాటించారు. పులివెందుల పట్టణంలోని, బేస్తవారిపల్లె డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. దాదాపు గంట పాటు పాఠశాల మొత్తం కలియ తిరిగి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల ఆవరణలో పాఠశాల గ్రౌండ్ బాత్రూమ్స్, వంటగదులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి పాఠశాలలో ఉన్న సమస్యల పై ఆరా తీసి రెగ్యులర్గా క్లాస్ లు జరుగుతున్నాయా...? ఉదయం టిఫిన్, ఆహారం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట గదికి వెళ్లి పరిసరాలు, అప్పుడే వండిన ఆహారాన్ని, కూరలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలనీ.. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని తెలిపి, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజూ పెడుతున్న టిఫిన్ కూరల గురించి ఆరా తీశారు. పరిసరాల శుభ్రత, తరగతి గది హాస్టల్ గది శుభ్రతపై పిల్లలకి అవగాహన కల్పించాలి. అనంతరం విద్యార్థులు ఎంత మంది ఉన్నారు.. స్టాఫ్ ఎంత మంది...? విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులు ఉన్నారా అని ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఆవరణలో శుభ్రంగా ఉంచాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ లను ఆదేశించారు. మీకు పాఠశాలలో ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకవస్తే వెంటనే వాటినీ పరిష్కారిస్తాను అని స్థానిక శాసనమండలి సభ్యుడిగా నాపై ఆ బాధ్యత ఉంది అన్నారు. అనంతరం ప్రభుత్వం గురుకుల పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించించడంతో పాటు విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేద్దాం

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సికిందర్

విశాలాంధ్ర-రాజంపేట: 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని ఏఐటియుసి సిఐటియు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు గాలి చంద్ర సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేల్ రవికుమార్ ఏఐటీయూసీ కార్యదర్శి సికిందర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రాజంపేట ఏఐటీయూసీ ఆఫీస్ యందు ఏఐటీయూసీ సిఐటియు ఉపాధ్యక్షు కార్యదర్శులు రవికుమార్ సికిందర్ సంయుక్త అధ్యక్షతన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. బిజెపి మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొస్తున్నారని, లేబర్ కోడ్లు అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. జూలై 9న సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సమ్మె జయప్రదానికి జిల్లాలో అన్ని రంగాల కార్మిక వర్గాలను సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి పందిగామణి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పివి రమణ లక్ష్మీదేవి ఎలక్ట్రికల్ యూనియన్ జిల్లా కార్యదర శ్రీహరి ఆటో ఆటో డ్రైవర్ వర్కర్స్ ఫెడరేషన్ పెంచలయ్య పెంచలయ్య సాయి కిరణ్ బాబు జాన్. టైల్స్ వర్కర్స్ యూనియన్ జమాల్ అంగన్వాడి యూనియన్ విజయమ్మ, రేవతి, ఏఐటీయూసీ ఆశా వర్కర్స్ యూనియన్ వెంకట సుబ్బమ్మ రెడ్డమ్మ యుఆర్ఎ సంగం శంకరయ్య ఆది ప్రైవేట్ హాస్టల్ యూనియన్ లక్ష్మీకర్ రెడ్డి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి(ఐఆర్) వెంటనే ప్రకటించాలి

విశాలాంధ్ర-రాయచోటి: పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఎస్టీయు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, మధుసూదన అన్నారు. నేడు రాయచోటిలోని విజ్ఞాన్ హైస్కూల్లో జరిగిన ఎస్ టియు రెండవ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 జూలై నుండి 12 పిఆర్సి అమలు కావలసి ఉండగా ఆలస్యమైనందున వెంటనే ఐఆర్ ప్రకటించాలని, అలాగే 12వ పిఆర్సి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు మధ్యంతర భృతి కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణ మన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 11వ పిఆర్సి బకాయిలను, డిఎ, సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, కడియాల మురళి, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రవీంద్రారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహులు, భాస్కర్ రెడ్డి, మున్వర్ భాష, గోపికృష్ణ, మోహన్, గురుమూర్తి, మురళీ మనోహర్, సునీర్, జనార్దన్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం భావ్యమా..?

- డాక్టర్ తులసి రెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: కడప జిల్లాపై కక్ష పెంచుకోవడం, విద్యార్థుల జీవితాలతో ఆడు కోవడం భావ్యం కాదని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి సూచించారు. వేంపల్లిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.670కోట్లతో నిర్మించిన పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభానికి నోచుకోలేదన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి నేషనల్ మెడికల్ కమీషన్ 50 యంబిబిఎస్ సీట్లు మంజూరు చేయగా కూటమి ప్రభుత్వం వద్దని లేఖ రాసిందన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రయత్నమే చేయలేదన్నారు. 2020లో కడపలో ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ విశ్వ విద్యాలయం ప్రారంభమైందని. ఇంత వరకు డిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నుంచి అనుమతి రాలేదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు అయోమయంలో పడిందన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమే కాలేదన్నారు. గతంలో కడప జిల్లా నుంచి ముఖ్య మంత్రి,ఉప ముఖ్యమంత్రి ఉండేవారని ఇప్పుడు కనీసం మంత్రి కూడా లేరన్నారు. పునరుద్ధరణ పనులు పూర్తి అయినప్పటికీ గండి వీరాంజనేయ స్వామి మూల విరాట్టు దర్శనం భక్తులకు లభించడంలేదన్నారు.

కాంగ్రెస్ డిమాండ్లు

కడప ఆర్కిటెక్చర్ ఫైనార్ట్స్ విశ్వ విద్యాలయానికి డిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనుమతి పొందాలి. 2025-26 అడ్మిషన్ల ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి. విశ్వ విద్యాలయానికి శాశ్వత భవనాలు నిర్మించాలి. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను వెంటనే ప్రారంభించాలి. గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో మూల విరాట్టు దర్శనం భాగ్యం భక్తులకు వెంటనే కల్పించాలి. మంత్రి వర్గం లోఖాలీ గా ఉన్న ఒక్క మంత్రి పదవిని కడప జిల్లా వారితో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

మాజీ ఉప ప్రధాని, ఏఐసీసీ మాజీ అధ్యక్షులు స్వర్గీయ బాబూ జగ్జీవన్ రామ్ 39వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఆదివారం వేంపల్లిలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్‌గొప్ప పరిపాలనా దక్షుడనీ,దేశ భక్తుడని, అసలు సిసలు గాంధేయవాది అని తులసి రెడ్డి కొనియాడారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామ కృష్ణ, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రినాథ్, రాఘవయ్య, వేమా రాజా, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: జనం కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి దళిత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం, ఆదర్శప్రాయం మని మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్ బాష, జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబులు కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ 39వ వర్ధంతి సందర్భంగా స్థానిక నగరంలోని మహావీర్ సర్కిల్ వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహానికి అంజాద్ బాష, నగర మేయర్ సురేష్ బాబులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైయస్సార్ జిల్లా పరిశీలకులు కొండూరు అజయ్ రెడ్డి, మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు షఫీ, రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రెటరీ అలీ అక్బర్, రాష్ట్ర బీసీ కార్యదర్శి బసవరాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఈస్ట్ జోన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంభటూరు ప్రసాద్‌రెడ్డి, జిల్లా ఆర్టిఐ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు కంచుపాటి బాబు, నగర మున్సిపల్ విభాగం అధ్యక్షుడు చెన్నయ్య, మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, నాయకులు గోపాలకృష్ణ, అంజి, సురేష్, రహీం, చైతన్య, తదితరులు ఉన్నారు.

ప్రేమత్యాగాలకు ప్రతిక మొహరం

విశాలాంధ్ర-రామాపురం: ప్రేమ త్యాగాలకు ప్రతికగా ముస్లిలు హిందువులు సోదర భావంతో జరుగును పండుగ మొహరం (పీర్ల పండగ) అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామంలో మోహరం (పీర్ల పండగ) పురస్కరించుకొని రాంప్రసాద్ రెడ్డి అభిమాని ఖాదర్ వల్లివిందు ఏర్పాటు చేశారు తన అభిమాని ఖాదర్ వలీ తనపై అభిమానంతో ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. గ్రామంలో మంత్రికి మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలలో హిందూ ముస్లింలు భాయ్ భాయ్ అంటూ కుల మతాలకు అతీతంగా ఎంతో ఉత్సాహంతో జరుపుకునే పండుగ మొహరం అంటూ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తనపై అభిమానంతో విందు ఏర్పాటు చేసి ఆహ్వానించిన ఖాదరవల్లిని అభినందించారు. ఎస్సై వెంకట్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు. టిడిపి నాయకులు సురేందర్ రెడ్డి వెంకట్రామిరెడ్డి, పట్టాభి రెడ్డి, సహదేవరెడ్డి, దేవదర్శన్ రెడ్డి, రామకృష్ణ గౌడ్, ధర్మారెడ్డి, సర్పంచ్ మునీర్ బాషా, ఉపసర్పంచ్ మహబూబ్బాషా అజామ్, వెంకటరమణ, శివారెడ్డి, బసిరెడ్డి శివశంకర్ రెడ్డి, దేరంగుల శ్రీనివాసులు, ఓబులేసు, ఆజామ్, ధనుంజయ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.